వలంటీర్ల సేవలు అభినందనీయం

- అర్హులకు పథకాలు అందించడంలో మీరే కీలకం
- పార్టీలకతీతంగా ఫలాలు అందించండి
- 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి


అమరాపురం: వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

అమరాపురం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన వారందరికీ అందించడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ మునిస్వామి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ఎమ్మెల్యే తిప్పేస్వామి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా రంజక పాలన సాగిస్తున్నారన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థను మన రాష్ట్రంలో అమలు చేశారన్నారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా పథకాల సొమ్మును నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తున్నారని కొనియాడారు. పారదర్శకంగా పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం జగన్ అని తెలిపారు. అవినీతికి తావులేకుండా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఎంపిక మొదలుకుని.. వారికి అందించే ఫలాలను వలంటీర్ల ద్వారానే అందించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.6 లక్షల మంది వలంటీర్లు సైనికుల్లా పేదలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ని పనులు ఉన్నా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్నారని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రస్తుతం జగనన్న ఇస్తున్న అమ్మ ఒడి, పింఛన్లు, నేతన్న నేస్తం, రైతు భరోసా, జగనన్న చేదోడు, విద్యాదీవెన, వసతి దీవెన, తదితర పథకాలు కనుమరుగవుతాయని తెలిపారు. ప్రజలను నిత్యం వలంటీర్లు కలవాలని.. వారి సమస్యలు విని వాటిని సచివాలయం ద్వారా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా అవార్డులతో సన్మానించడం హర్షణీయమన్నారు. రాబోవు రోజుల్లో ఇంకా అర్హత ఉన్న వారికి పథకాలను చేరవేస్తూ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. మళ్లీ తమ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం వలంటీర్లను సేవా పురస్కారాలతో సన్మానించారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ రాష్ట్ర చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, డైరెక్టర్లు వీరక్యాతరాయ, క్రిస్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, సచివాలయ కన్వీనర్లు ఎంపీటీసీలు, సర్పంచులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పులమతిలో వలంటీర్లకు సన్మానం

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ అశ్వత్థనారాయణ అధ్యక్షతన శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. బాగా పని చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం వలంటీర్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య, వీఆర్ఓ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకర్‌రావు, కరియప్ప తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షి: వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు


ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్టం)
హిందూపురం : 35.0
పెనుకొండ : 38.0
మడకశిర : 35.0

క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి


బసవనపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండలంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి కోరారు. శనివారం మండలంలోని బసవనపల్లి పంచాయతీ ఉప్పార్లపల్లి సమీపంలో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా ఈ పనులను చేపట్టామన్నారు. ప్రతి కూలీ పనులను వెంటనే ముగించాలన్నారు. చేసిన కూలి పనులకు బిల్లులు అందజేస్తామని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం డాక్టర్ దినకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పార్వతమ్మ, సవిత, విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి అనంతపురం నుంచి చిన్న పిల్లలు, పుట్టిన పిల్లల వైద్యుడు దినకర్ హాజరుకానున్నారు.

మంత్రి రామలింగారెడ్డికి శుభాకాంక్షలు


రామలింగారెడ్డిని సన్మానిస్తున్న పావగడ రెడ్డి సంఘం నాయకులు

పావగడ: రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న బెంగళూరు బీటీఎం విధానసభ క్షేత్రం ఎమ్మెల్యే రామలింగారెడ్డిని శనివారం ఆయన కార్యాలయంలో స్థానిక పావగడ రెడ్డి జన సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. రెండో సారి మంత్రి పదవి చేపట్టిన రామలింగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడు ధనుంజయ రెడ్డి, కార్యదర్శి నాగార్జునరెడ్డి, డైరెక్టర్లు సుబ్బారెడ్డి, కేఈబీ నరసరెడ్డి, జయశంకరరెడ్డి, మంజునాథ్ రెడ్డి, రామాంజినరెడ్డి, చింతలరెడ్డి, బాబు రెడ్డి, భీమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో చదువుకోండి


చెస్ ఆడుతున్న విద్యార్థులు

అమరాపురం: వేసవి విజ్ఞాన శిబిరానికి వస్తున్న విద్యార్థులు కేవలం చదువే కాకుండా ఆట పాటలతో విజ్ఞానం పెంచుకోవాలని వి.అగ్రహారం ఉన్నత పాఠశాల హెచ్ఎం కరిబడప్ప అన్నారు. శనివారం గ్రంథాలయాన్ని సందర్శించారు. విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు ఆటలు పాటలు, క్విజ్ తదితర వాటిని నేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం వేసవిలో విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించడం ఉపయోగమన్నారు. సెలవుల్లో విద్యార్థులు ఇంటి వద్ద సెల్‌ఫోన్లకు అలవాటు పడకుండా ఇలాంటి శిక్షణకు హాజరుకావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి చెస్ ఆడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఇబ్రహీం పాల్గొన్నారు.

స్థల పరిశీలన


పౌర సరఫరాల గోదాముకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తిక్

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని షీఫారం వద్ద రైల్వే వంతెన సమీపంలో ఉన్న సర్వే నంబర్ 1-1 లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని శనివారం సబ్ కలెక్టర్ కార్తీక్, తహసీల్దార్ స్వర్ణలత, మండల సర్వేయర్ కోదండపాణి, ఇతర రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. పౌర సరఫరాల గోదాము నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

లేపాక్షి ఆలయంలో పర్యాటకుల సందడి


అన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న పర్యాటకులు

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి ఆలయంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించడానికి పర్యాటకులు పోటీపడ్డారు. ఆలయ విశిష్టతను గైడ్స్ అర్చకుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం నంది విగ్రహం, థీంపార్కు, జటాయువు పక్షి తదితర ప్రాంతాలను సందర్శించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులకు అన్నదాన సత్రంలో భోజన వసతి కల్పించారు. పర్యాటకులకు కమిటీ సభ్యులతో పాటు సేవాకర్తలు ప్రసాదం అందజేశారు.

రేపటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

గుడిబండ: మండలంలో ఈనెల 29వ తేదీ నుంచి రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 900 క్వింటాళ్ల విత్తన వేరుశనగ వచ్చిందన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో బుక్ చేసుకున్న వారికి మాత్రమే విత్తన వేరుశనగ అందజేస్తామన్నారు.

రోడ్డుపై చెత్త వేయొద్దు

మడకశిరరూరల్: మండలంలోని మెళవాయి పంచాయతీలోని గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేస్తూ రోడ్లపై పడేసిన చెత్తను తొలగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ రంగనాథ్ శనివారం కార్మికులకు సూచించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. సేంద్రియ ఎరువులు తయారు చేయాలని వివరించారు. గ్రామాల్లో రోడ్డుపై చెత్త కుప్పలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సకాలంలో పనులు చేయించకపోతే చర్యలు


వానవోలు పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

గోరంట్ల: మండలంలో పలు పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద రెండో విడతలో చేపట్టిన పనులను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి పరిశీలించారు. దిగువగంగంపల్లి, కొలిమిపల్లి, గుంటిపల్లి తండా, వానవోలు జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాల, ఉర్దు ఉన్నత పాఠశాల, గుమ్మయ్యగారిపల్లి, బూదిలి, వడిగేపల్లి, రెడ్డిచెరువుపల్లి, మందలపల్లి పాఠశాలల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. కాంపోనెంట్ పనులు పూర్తి చేయడంలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విఫలమైనట్లు గుర్తించారు. మెమోలు జారీ చేశారు. వచ్చే నెల ఐదో తేదీలోపు మండల వ్యాప్తంగా రెండో విడత కింద 40 పాఠశాలల్లో జరుగుతున్న పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులపై శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గోపాల్‌నాయక్, మండల ఇంజనీర్ రవీంద్రా, సచివాలయ ఇంజినీర్లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలి


జన సంపర్క సభలో మాట్లాడుతున్న పూజారప్ప

పావగడ: స్థానిక పోలీసులు కేసుల పరిష్కారంలో నిష్పక్ష పాతంగా వ్యవహరించి, బాధితులకు న్యాయం చేయాలని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప సూచించారు. స్థానిక ఆంధ్ర గిరి ఫంక్షన్ హాల్‌లో స్థానిక సీఐ అజయ్ సారథి ఆధ్వర్యంలో శనివారం జన సంపర్క సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే సాధారణ గొడవలను సైతం పెద్దవిగా చేసి అమాయకుల పైన కేసులు చేసిన సంఘటనలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చాలా ఉన్నాయని తెలిపారు. ఒక నిరపరాధిపై కేసు మోపి అరెస్ట్ చేసి చివరకు వేలాది రూపాయల ఖర్చుతో బెయిల్‌పై తిరిగొచ్చిన సంఘటన కూడా ఉందని వెల్లడించారు. ఎలాంటి ప్రచారం చేయకుండా, సంఘ సంస్థల నాయకులకు సమాచారం అందించకుండాలో గుట్టుగా జన సంపర్క సభ నిర్వహించడం శోచనీయమన్నారు. ఏఐటీయూసీ నాయకురాలు సుశీలమ్మ మాట్లాడుతూ.. పట్టణంలో ఎన్నో దొంగతనాలు, అత్యాచారాలు జరిగాయని అయితే వాటిపై ఇంత వరకూ బాధితులకు న్యాయం జరగ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కణివేనహళ్లి నాగరాజు మాట్లాడుతూ.. కణివేనహళ్ళి గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. 20 ఏళ్ల వయస్సు పిల్లలే అతిగా మద్యం సేవించి గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు చొరవ తీసుకుని, అక్రమ మద్యం అమ్మకాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐ అజయ్ సారథి, తదితర పోలీసులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు

- అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు


మాట్లాడుతున్న జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి

నల్లమాడ: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. వాతావరణ ఆధారిత సాంకేతిక సలహాలపై స్థానిక సాధన మండల సమాఖ్య కార్యాలయ సమావేశ భవనంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సహదేవరెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ సుధీర్, డాక్టర్ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి హాజరయ్యారు. ముందుగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వాతావరణాన్ని బట్టి పంటల మార్పిడి చేపట్టి, అవసరమైన మేరకు ఎరువులు వాడితే మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. కందిలో నూతన వంగడాలను వివరించారు. డీఏఓ సుబ్బారావు మాట్లాడుతూ వేరుశనగలో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఆవుటాల రమణారెడ్డి కోరారు. కదిరి ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రఘునాథరెడ్డి, మండల వ్యవసాయాధికారి సుమతి, ఏపీ మాస్ సిబ్బంది గోపాలరాజు, ఈశ్వరరెడ్డి, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వికలాంగ ఉద్యోగుల దివ్యాంజన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థప్ప శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో భారీ ఎత్తున లక్షన్నర ఉద్యోగాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడు రుణపడి ఉంటామన్నారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయ బదిలీల్లో వికలాంగ ఉద్యోగులకు ఎలాంటి ప్రాధాన్యత కల్పించలేదన్నారు. బదిలీల్లో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

ఘనంగా అక్కమ్మగార్ల జాతర

రామగిరి: మండలంలోని కొత్తగ్యాదికుంట సమీపంలో అక్కమ్మగార్ల జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయాన్నే గ్రామదేవత అక్కమ్మగార్లను గ్రామంలో ఊరేగించారు. అనంతరం మహిళలు బోనాలు మోసుకుని అమ్మవారికి సమర్పించారు. ప్రతి మూడేళ్లకోసారి జరిగే ఈ వేడుకలకు ఆ గ్రామస్తులతోపాటు, రామగిరి, కనగానపల్లి మండలవాసులు హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ జనార్దన్ నాయుడు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


అలంకరణలో అక్క దేవతలు

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు


క్యూలైన్‌లో నిలబడిన భక్తులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. కదిరి పరిసరాల ప్రాంతాలతోపాటు చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాలనుంచి, కర్ణాటక నుంచికూడా భక్తులు తరలివచ్చి క్యూలైన్లలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసింది.

రేపు 'వలంటీర్లకు వందనం'

మడకశిర: పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 11 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులందరూ తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మడకశిర: నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన 25 మంది వాల్మీకి, బోయ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. శనివారం వీరికి జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పుట్టపర్తిలో ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పుట్టకామప్ప, జిల్లా సంయుక్త కార్యదర్శి సూర్యనారాయణ, మడకశిర నియోజకవర్గ అధ్యక్షుడు జోగప్ప, ప్రధానకార్యదర్శి బంగారులింగ, కోశాధికారి మంజునాథ్, స్థానిక నాయకులు మారుతి, దేవరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి: పందుల పెంపకం కోసం డీఎస్సీ కంపెనీ నుంచి గత కొంతకాలంగా వేస్ట్ ఫుడ్ తెచ్చుకుంటున్న తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బాలస్వామి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రవి తదితరులు తనపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయితే ఘటనకు మారుతి అనే వ్యక్తికి ఎటువంటి సంబంధం లేదన్నారు. పోలీసులు నిస్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

మడకశిరరూరల్: మండలంలో 5 ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైల్యాండ్‌హార్టికల్చర్‌లో పండ్ల తోటల పెంపకానికి ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా మామిడి, జామ, అల్ల నేరేడు, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి తదితర మొక్కలను పెంచుకోవచ్చన్నారు. సాగు చేసిన మొక్కలను రక్షించుకునేందుకు రైతులకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు బిల్లులు చెల్లింస్తుందన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత కల్పిందన్నారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమష్టి కృషితో కాలుష్య నియంత్రణ


కాలుష్యం తగ్గిస్తాం అంటూ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, వాహనదారులు

హిందూపురం టౌన్: కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని డీటీఓ కరుణ సాగర్‌రెడ్డి, డీఎస్పీ కంజాక్షన్ పిలుపునిచ్చారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక ఎస్‌బీఐ సర్కిల్ నుంచి ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్ చేరుకుని ప్రజలు, ఆటో డ్రైవర్లు, వాహనదారులతో కలిసి పర్యావరణాన్ని కాపాడుకుందాం.. కాలుష్యాన్ని తగ్గిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీటీఓ, డీఎస్పీ మాట్లాడుతూ.. వాహన కాలుష్యం ద్వారా పర్యావరణం దెబ్బతిని ఏటా మరణాలతో పాటు వేలాది మంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. కాలుష్యం ఇలానే పెరిగితే భవిష్యత్ తరాల వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. కాలుష్య నివారణకు వాహనదారులు, ప్రజలు నడుంబిగించాలన్నారు. ట్రాఫిక్‌లో, రైల్వేగేట్ల వద్ద ఎక్కువ సమయం వాహనాల్లో వేచి ఉండాల్సి వస్తే తప్పనిసరిగా వాహనాల ఇంజన్‌ను ఆఫ్ చేసి ఉంచాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, సీఐ ఈరన్న, ఎంవీఐలు రమణ, శివశంకర్, జయశ్రీ, ఎస్ఐ శ్రీనివాసులు, రవాణా, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

కేబినెట్‌లో కేఎన్ రాజణ్ణకు చోటు


మంత్రి కేఎన్ రాజణ్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం సిద్ధరామయ్య

పావగడ: తాలూకా సమీప సరిహద్దులోని మధుగిరి విధానసభ క్షేత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఎన్ రాజణ్ణకు మంత్రి పదవి లభించడంతో స్థానిక వాల్మీకి సంఘం నాయకులు, కేఎన్ఆర్ అభిమాన సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బెంగళూరులోని రాజభవన్‌లో శనివారం కేఎన్ రాజణ్ణ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి రాజణ్ణకు సీఎం సిద్ధరామయ్య పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక వాల్మీకి సంఘం నాయకులు మదకరి నాయక సంఘం తాలూకా అధ్యక్షుడు డా ఓంకారనాయక, వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాళేగార్ లోకేశ్, భాస్కర నాయక, ఓంకార నాయక, అనంతయ్య, తిప్పేస్వామి, టైలర్ నారాయణప్ప తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

బండి ఆపాల్సి వస్తే ఇంజిన్ ఆఫ్ చేయండి


వాహదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ వరప్రసాద్, సీఐ తమ్మిశెట్టి మధు

కదిరి అర్బన్: ట్రాఫిక్ జామ్ అయినపుడు, సిగ్నల్ వద్ద బండి ఆపాల్సివస్తే ఇంజన్‌ను స్విచ్ఛాఫ్ చేసి ఉంచితే ఇంధన పొదుపుతో పాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాహన చోదకులకు శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు పాల్గొన్నారు. ఎంవీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌లో జామ్ అయినపుడు కొన్ని వందల వాహనాల వెలువడే పొగ ఆ ప్రాంతమంతా విస్తరించి వాతావరణ కాలుష్యానికి దారితీస్తుందన్నారు. ఎక్కడ పడితే అక్కడ హారన్ మోగించరాదన్నారు. అనంతరం వాహన చోదకులతో పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు.

నల్లచెరువు: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కదిరి ఆర్టీఓ వరప్రసాద్ సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులతో సమావేశమై పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కాల పరిమితి మించిన వాహనాలను ఉపయోగించవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు వాహనాలు నడప వద్దని సూచించారు. నల్లచెరువు పోలీస్ అధికారులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

గనుల తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం నిడిమామిడి సమీపంలోని కొండపై గనుల తవ్వకాలకు సంబంధించి శనివారం నిడిమామిడి గ్రామంలో ఆర్డీఓ భాగ్యరేఖ, కాలుష్యనియంత్రణ మండలి అధికారి మురళీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ మైనింగ్ కోసం మూడు కంపెనీలు సుమారు 50 హెక్టార్లలో అనుమతులు పొందాయన్నారు. వాటి ఏర్పాటుతో ఇబ్బందులకన్నా లాభాలు అధికంగా ఉంటాయని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

పెనుకొండ: పట్టణంలో శనివారం బీజేపీ నాయకులు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్ స్వగృహంలో సమావేశం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ 9 సంవత్సరాల పాలన పూర్తి కావడంతో హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బూత్ కమిటీలు, శక్తికేంద్రాలు, మండల పాలక మండలి కార్యక్రమాలు తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజినేయులు, సూరి, హనుమంతు యాదవ్, , రామకృష్ణ, సుభద్రమ్మ, లక్ష్మీకాంత్ నాయక్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ గోల్‌మాల్‌పై కొనసాగిన విచారణ

మడకశిర: మడకశిర పంచాయతీరాజ్ శాఖలో జరిగిన సిమెంట్ గోల్‌మాల్‌పై శనివారం కూడా విజిలెన్స్ విచారణ జరిగింది. రొళ్ల, అగళి మండలాల్లో విజిలెన్స్ అధికారులు విచారణ కొనసాగించారు. ఐదుగురు సభ్యులు ఉన్న విజిలెన్స్ అధికారుల బృందం ఈ విచారణను కొనసాగించారు. ఈ రెండు మండలాల్లోని వివిధ గ్రామాలను సందర్శించి పీఆర్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పనులకు ఎంత మేరకు సిమెంట్ ఉపయోగించారో లెక్కలు వేశారు. మండలాల్లో విచారణ పూర్తి కాగానే మడకశిర మండలంలో కూడా విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.